## రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.

అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం

మరిన్ని వివరాలకు సంప్రదించగలరు
8125972476

క్విక్ టుడే



quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక




## పుష్ప-2 సినిమా టిక్కెట్ ధరల పెంపు

నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశం

3


EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476

మల్కాజిగిరి సంపుటి : 2 సంచిక : 84 బుధవారం 4 డిసెంబర్ 2024 వెల : 3 రూ/.. పేజీలు - 8





### నేర నియంత్రణ చట్టాలు
## బలమైన ముందడుగు

బ్రిటీష్ భావజాలం నుంచి మనం బయటపడాలి

భారతీయులను లొంగదీసుకునేందుకు ఆనాటి చట్టాలు

చండీఘడ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోడీ

**చండీఘడ్, డిసెంబర్3:** రాజ్యాంగం కన్నకలలను సాకారం చేసేందుకు దేశంలో అమల్లోకి వచ్చిన సరికొత్త నేర నియంత్రణ చట్టాలు బలమైన ముందడుగుగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. బ్రిటీష్ వలస విధానం నుంచి మనం బయటపడాల్సి ఉందన్నారు. చండీగఢ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్య్రం వచ్చిన 70 ఏళ్లలో దేశం ఎదుర్కొంటున్న పలు సమస్యలను జాగ్రత్తగా అధ్యయం చేసి వీటిని రూపొందించారన్నారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు. ఆంగ్లేయులు వెళ్లిపోయాక వారి చట్టాల నుంచి విముక్తి లభిస్తుందని భావించారు. అసలు భారత్‌పై పట్టుబిగించేందుకు ఏం చేయడానికైనా సిద్ధపడి వారు ఆ చట్టాలను చేశారు. కానీ, స్వాతంత్య్రం వచ్చాక కూడా దురదృష్టవశాత్తు ఆ పాత చట్టాల చుట్టూ పాలకులు తిరిగారు. కానీ, ఇప్పుడు దేశం ఆ వలసపాలకుల మనస్తత్వం నుంచి బయటపడింది'

మిగతా 2లో..

# గ్లోబల్ సిటీగా హైదరాబాద్

## ఎవరెన్ని కుట్రలు పన్నినా అభివృద్ధి ఆగదు



నిధులు తెస్తరా? గుజరాత్ కు వలసపోతారా?

కిషన్ రెడ్డిని నిలదీసిన సీఎం రేవంత్ రెడ్డి

మూసీ ప్రక్షాళనతో నిర్వాసితులకు అండగా ఉన్నాం

నిద్రలు చేయడం మాని నిధులు తీసుకురండి

హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం సహకారం కావాలి

కేంద్రం నుండి రూ.10 వేల కోట్లు తీసుకురండి

పదేళ్లు తెలంగాణను భ్రష్టు పట్టించిన కేసీఆర్

అప్పుల ఊబిలోకి నెట్టేసిన ఘనత ఆయనదే

రైజింగ్ ఉత్సవాలలో సీఎం రేవంత్ రెడ్డి

హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ లో రైజింగ్ ఉత్సవాల నిర్వహణ

**హైదరాబాద్, డిసెంబర్3 (క్విక్ టుడే న్యూస్):** హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మార్చాలనేది తమ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం మాయమాటలు చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. హైదరాబాద్ నగర సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించి, నగరానికి కావలసిన మౌలిక సదుపాయాలపై తాము ప్రత్యేక దృష్టి సారించామన్నారు. హైదరాబాద్ లోని ఎన్టీఆర్ మార్గ్ వద్ద గల హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ లో హైదరాబాద్ రైజింగ్ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రైజింగ్ ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. సీఎం వెంట

మిగతా 2లో..

### ఒక్కో నియోజకవర్గానికి
## 3500 ఇందిరమ్మ ఇళ్లు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రేపటి నుంచి పంపిణీకి శ్రీకారం

రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇళ్ల మంజూరు

ఈనెల 6నుంచి గ్రామాల్లో అధికారుల పర్యటన

లబ్ధిదారులను గుర్తించనున్న అధికారులు

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటన



**హైదరాబాద్, డిసెంబర్ 3 (క్విక్ టుడే న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్ 5న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శ్రీకారం చుట్టబోతున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

మిగతా 2లో..

## హైడ్రాకు భారీగా నిధులు కేటాయింపు

రూ.50 కోట్ల నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు

**హైదరాబాద్, డిసెంబర్3 (క్విక్ టుడే న్యూస్):** హైదరాబాద్ నగరంలోని చెరువులు, కుంటలు, పార్కుల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రా కు తెలంగాణ ప్రభుత్వం భారీ నిధులు కేటాయించింది. మంగళవారం, హైడ్రా కార్యాలయ నిర్వహణకు, వాహనాల కొనుగోలుకు రూ.50 కోట్ల నిధులు విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. హైడ్రా ఆవిర్భావం తరువాత జీహెచ్‌ఎంసీ(ఉఊఓఅ) పరిధిలోని పలు చెరువులు, కుంటలు ఆక్రమణల నుండి విముక్తి పొందాయి. అక్రమ నిర్మాణాలను కూల్చివేసి నగరంలోని పర్యావరణాన్ని కాపాడేందుకు ఈ సంస్థ నిరంతర శ్రమ చేస్తోంది. ల్గ÷ద్రాకు మరింత శక్తివంతమైన అధికారాలు ఇవ్వడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ద్వారా హైడ్రా అనేక విస్తృత అధికారాలను పొందుతూ, చెరువుల రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను అధునాతన సాంకేతిక పద్ధతులు, వాహనాల

మిగతా 2లో..

### నియంత పాలనకు
## చరమ గీతం పాడి ఏడాది

గడీల పాలనతో రాష్ట్రం విసిగిపోయింది

కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



**హైదరాబాద్, డిసెంబర్3 (క్విక్ టుడే న్యూస్):** రాష్ట్రంలో నియంత పాలనకు చరమ గీతం పాడి ఏడాది అయ్యింది. ప్రజా పాలన ఏర్పాటుకు సంపూర్ణంగా సహకరించిన తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ గడీల పాలన, ఫామ్ హౌస్ పాలనతో విసిగిపోయింది తెలంగాణ. అవినీతి, కుటుంబ పాలనకు స్వస్తి పలికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటైంది. సంపూర్ణ మెజారిటీ ఇచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మద్దతు ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు.ఏడాది పాలనలో ముఖ్యమంత్రి

మిగతా 2లో..

### మహారాష్ట్ర సీఎంగా
## దేవేంద్ర ఫడ్నవీస్!

ఏక్‌నాథ్ షిండేకు డిప్యూటీ సీఎం

5న ప్రమాణస్వీకారం



**ముంబై, నవంబర్ 3:** మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా

మిగతా 2లో..

## భారత్,చైనాల మధ్య సంబంధాలు బలోపేతం

సరిహద్దుల్లో కలసి నడుస్తున్న ఇరు దేశాలు

లోక్‌సభకు వెల్లడించిన విదేశాంగ మంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ, డిసెంబర్3:** గతంలో కొంత మందగించినప్పటికీ, భారత్- చైనా సంబంధాలు ఇటీవల కొంత మెరుగయ్యాయని విదేశాంగశాఖ

మిగతా 2లో..

### రాజధాని నిర్మాణానికి
## వేగంగా చర్యలు

కాకినాడ పోర్టు, అదానీ వ్యవహారంపై చర్చ

సమీకృత పర్యాటక, స్పోర్ట్స్ పాలసీ

ఆయుర్వేద, హోమియోపతి రిజిస్ట్రేషన్ చట్ట సవరణ

ఐటీ, గ్లోబల్ కాంపిటేటివ్ సెంటర్స్ పాలసీకి ఆమోదం

ఏపీ టెక్స్‌టైల్ అపరల్ అండ్ గార్మెంట్స్ పాలసీ ఆమోదం

ఏపీ కేబినేట్‌లో పలు కీలక నిర్ణయాలు



**అమరావతి, హైదరాబాద్, డిసెంబర్ 3 (క్విక్ టుడే న్యూస్):** కాకినాడ పోర్టు, గౌతమ్ అదానీ వ్యవహారంపై కేబినేట్ భేటీలో మంత్రివర్గం కీలకంగా చర్చించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సమీకృత పర్యాటక పాలసీ 2024-29తో

మిగతా 2లో..

## లక్ష కేసులు పెట్టినా భయపడేది లేదు

ప్రజా కోర్టులో నీకు శిక్ష తప్పదు : హరీశ్‌రావు



**హైదరాబాద్, డిసెంబర్ 3 (క్విక్ టుడే న్యూస్):** సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. మిస్టర్ రేవంత్ రెడ్డి అడుగడుగునా నువ్వు చేస్తున్న అన్యాయాలను నిలదీస్తున్నందుకు, నీ నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నందుకు, ప్రజల పక్షాన నీ మీద ప్రశ్నలు సంధిస్తున్నందుకు భరించలేక, సహించలేక నామీద అక్రమ కేసులెన్నో బనాయిస్తున్నావని మండిపడ్డారు. నీకు చేతనైంది ఒక్కటే.. తప్పు చేసి దబాయించడం, తప్పుడు కేసులు బనాయించడమని విమర్శించారు. రుణమాఫీ విషయంలో దేవుళ్లను సైతం దగా చేసినవు అని అన్నందుకు యాదగిరి గుట్ట పోలీసు స్టేషన్‌లో తనపై తప్పుడు కేసు పెట్టించాడని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. ఇచ్చిన హామీలను ఎగవేస్తున్న నిన్ను ఎగవేతల రేవంత్ రెడ్డి అని అన్నందుకు బేగం బజార్ పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించినవని అన్నారు. సోషల్ మీడియాలో ఎవరో పెట్టిన పోస్టుకు సైబర్ క్రైం పోలీసు స్టేషన్ లో నా మీద సంబంధం లేని కేసు పెట్టించినవని విమర్శించారు. పార్టీ కార్యక్రమంలో మాట్లాడితే కోడిగుడ్డుమీద ఈకలు పీకి, తలాతోక లేని కేసొకటి మానకొండూరులో అక్రమ కేసు పెట్టించినవని అన్నారు. నీ రెండు నాల్కల వైఖరిని బట్టబయలు చేసినందుకు, ప్రజాక్షేత్రంలో నిలదీసినందుకు తట్టుకోలేక ఇవాళ పంజాగుట్ట స్టేషన్‌లో మరో తప్పుడు కేసు పెట్టించారని తెలిపారు. నువ్వు లక్ష తప్పుడు కేసులు పెట్టించినా, నేను ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపనని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రజా కోర్టులో, ప్రజా తీర్పుతో నీకు తగిన శిక్ష పడేంత వరకు ఆగనని తెలిపారు.

## హరీశ్‌రావుపై పంజాగుట్టలో కేసు నమోదు

**హైదరాబాద్, డిసెంబర్ 3 (క్విక్ టుడే న్యూస్):** మాజీ మంత్రి హరీశ్ రావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని సిద్దిపేటకు చెందిన చక్రధర్ గౌడ్ జూబ్లీహిల్స్ ఏసీపీకి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో హరీశ్‌రావుపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ

మిగతా 2లో..

RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

QUICK TODAY

బుధవారం 4 డిసెంబర్ 2024

quicktodaynews.com



మొదటి పేజీ తరువాయి..

# హైడ్రాకు భారీగా నిధులు కేటాయింపు

కొనుగోలు, కార్యాలయ నిర్వహణకు ఉపయోగించనున్నారు. ఈ నిధులు హైడ్రా పనితీరుకు మరింత బలం చేకూరుస్తాయి. ఈ చొరవతో చెరువుల సంరక్షణ, పర్యావరణ రక్షణలో హైదరాబాద్ నగరం దేశానికే ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో హైడ్రా కొరడా ఝుళిపించింది. అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో పార్కు స్థలాన్ని ఆక్రమించి, ఓ వ్యక్తి కంటైనర్ ఏర్పాటు చేసిన ఘటనపై హైడ్రా, పోలీసులు చర్యలు తీసుకున్నారు. కాలనీ వాసులు ఈ సమస్యను మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి నివేదించారు. గతంలో ఈ ఘటనపై కమిషనర్, హైడ్రా, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, వెంటనే చర్యలు తీసుకోవడం లేదని వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న లక్ష్మారెడ్డి, హైడ్రా, మున్సిపల్, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం తెల్లవారుజామున హైడ్రా, మీర్‌పేట్ పోలీసులు సంయుక్తంగా చర్యలు చేపట్టి, పార్కు స్థలంలో ఏర్పాటు చేసిన కంటైనర్‌ను ధ్వంసం చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు ఆటపరికరాలను తిరిగి ఏర్పాటు చేశారు. హైడ్రా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, ఇతర పార్కు స్థలాల ఆక్రమణలపై కూడా ఫిర్యాదులు అందాయని, వాటిపై త్వరలోనే చర్యలు తీసుకోబడతాయని పేర్కొన్నారు. ఈ చర్యలతో బడంగ్‌పేటలో భూకబ్జాదారులకు గట్టి హెచ్చరిక వెళ్లిందని విశ్లేషకులు అంటున్నారు.

### రాజధాని నిర్మాణానికి

# వేగంగా చర్యలు

పాటు 2024 నుంచి 2029 స్పోర్ట్స్ పాలసీలో మార్పులకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. పీఎం ఆవాస్ యోజన గిరిజిన గృహ పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏపీ మారిటైమ్ పాలసీకి, ఏపీ టెక్స్‌టైల్స్ గార్మెంట్ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఐటీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ పాలసీ 4.0కు, పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని డిసెంబరు 15ను ఆత్మార్పణ సంస్మరణ దినంగా నిర్వహించడానికి ఆమోదం తెలిపారు. ఆయుర్వేద, హోమియోపతి ప్రాక్టీషనర్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణకు సైతం చంద్రబాబు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏపీ మంత్రివర్గ సమావేశంలో అదానీ పవర్ వ్యవహారంపై కీలకంగా చర్చ జరిగింది. వైసీపీ హయాంలో విద్యుత్ కొనుగోళ్లలో సెకీతో ఒప్పందంపై ఇటీవల ఆరోపణలు రావడం తెలిసిందే. సెకీ ఒప్పందంపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై చర్చించారు. అదానీ పవర్‌పై నిర్ణయం తీసుకునే వరకు పవర్ సప్లై అగ్రిమెంట్‌ని పెండింగ్‌లో పెట్టాలని మంత్రివర్గం భావిస్తోంది. అదానీతో గత ప్రభుత్వం విద్యుత్ ఒప్పందం కారణంగా రూ. 1750 కోట్ల ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చాయి. ఏపీ కేబినెట్‌లో ఈ విషయాలను సహచర మంత్రులకు చంద్రబాబు వివరించారు. విద్యుత్ ధరలు తగ్గించకపోతే ఒప్పందాన్ని రద్దు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. పెనాల్టీ చెల్లించడమే ఉత్తమమని మంత్రివర్గం భావిస్తోంది. అదానీతో విద్యుత్ ఒప్పందం రద్దు చేసుకుంటే రూ. 2100 కోట్లు పెనాల్టీగా చెల్లించాల్సి ఉంటుందని కీలకంగా చర్చించారు. మంగళవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రిమండలి సమావేశం అయింది. ఈ సమావేశంలో 10 అంశాలపై కేబినెట్‌లో కీలకంగా చర్చించారు. పలు పాలసీలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 3గంటల పాటు సమావేశం సాగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వెల్లడించారు. 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ గ్లోబల్ కాంపిటేటివ్ సెంటర్స్ పాలసీ 2024-29కి ఆమోదం తెలిపాం. 2047లో భాగంగా ఒక కుటుంబానికి ఓ పారిశ్రామికవేత్త లక్ష్యాల సాధనకు ఈ పాలసీ ఉపయోగపడుతుంది. ప్రభుత్వం కో వర్కింగ్ స్పేస్‌లు, నైబర్ వర్కింగ్ స్పేస్‌లు క్రియేట్ చేయాలని నిర్ణయం. వర్క్ ఫ్రం హోంకు ఈ విధానం ఎంతో ఉపయోగపడనుంది. ఇలా స్పేస్‌లు డెవలెప్ చేసే వారికి ఇన్సెంటివ్ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అన్ని రకాల వ్యాపారాలతో పాటు ఐటీ కంపెనీలు అవే భవనాల్లో ఉండాలనే కోవర్కింగ్ స్పేస్ పనిచేస్తుంది' అని మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. వందమందికి వర్కింగ్ స్పేస్ ఏర్పాటు చేస్తే ఒక్కొక్కరికి రూ. 2వేలు చొప్పున ఇన్సెంటివ్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. ఏపీ టెక్స్‌టైల్ అపరల్ అండ్ గార్మెంట్స్ పాలసీ 2024-29కి క్యాబినెట్‌లో ఆమోదం పొందింది. రూ.10 వేల కోట్లు పెట్టుబడులు ఈ రంగంలో రావాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. చేనేత కార్మికులకు, పద్మశాలీలకు ఈ పాలసీ వల్ల ఎంతో ఉపయుక్తం అవుతుంది. ఈ పాలసీలో రాయితీలు పెద్ద ఎత్తున రాయితీ ఇస్తాం, పీపీపీ మోడ్‌లో అయిదు టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు ఈ పాలసీ లక్ష్యం. ఏపీ మారిటైమ్ పాలసీకి క్యాబినెట్‌లో ఆమోదం. మూడు తాగునీటి ప్రాజెక్టులు ఆలస్యం అవ్వడం వల్ల జీవో 62 ద్వారా ప్రైజ్ ఎ÷-జడెస్ట్‌మెంట్ చేయబోతున్నాం. ఉద్దానం తాగునీటి వసతి పులివెందుల, కర్నూలులో డోన్ నియోజకవర్గాలకు పదిన్నర లక్షల మందికి తాగునీటి సమస్య తీర్చడానికి నిర్ణయం. దీనిలో ఒకటి మాజీ ముఖ్యమంత్రి నియోజకవర్గం కాగా మరొకటి మాజీ ఆర్థిక మంత్రి నియోజకవర్గం. పీఎంఏవై అర్బన్ , పీఎంఏవై గ్రామీణ్ పథకాల ద్వారా కేటాయించిన గృహాలు కొనసాగించి నిర్మించడానికి క్యాబినెట్ ఆమోదం. పీఎంఏవై అర్బన్ , పీఎంఏవై గ్రామీణ్ పథకాల ద్వారా కేటాయించిన గృహాలు కొనసాగించి నిర్మించడానికి క్యాబినెట్ ఆమోదం. పర్యటక రంగానికి పారిశ్రామిక హోదా ఇవ్వడం ద్వారా కొత్త ఉద్యోగాలు కల్పన సాధ్యం అవుతుంది. రాజధాని అమరావతిని ఎలక్ట్రికల్ మొబిలిటీ నగరంగా అభివృద్ధి చేయాలని నిర్ణయం. రియల్ టైం గవర్నెన్స్‌ను తెచ్చి అప్పట్లో పాలనలో చంద్రబాబు రిఫార్మ్స్ తెచ్చారు. దీనికి సంబంధించి ఆర్టీజీ 4.0 అమలుకు ప్రతిపాదన. వాట్సాప్ ద్వారానే అన్ని రకాల సర్టిఫికెట్లు అందించే ఏర్పాట్లు చేస్తున్నాం' అని మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. అమరావతి రాజధాని పనులను కొంత మేరకు గత టీడీపీ ప్రభుత్వంలో పూర్తి చేశామని మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వం మూడు ముక్కలు ఆటలు ఆడి రాజధాని పనులను నిలిపేసిందని మండిపడ్డారు.

### ఒక్కో నియోజకవర్గానికి

# 3500 ఇందిరమ్మ ఇళ్లు

తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలో మంగళవారం (డిసెంబర్ 03) వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్?తో కలిసి ఆయన విస్తృత పర్యటన చేశారు. ఈ సందర్భంగా రూ.3 కోట్ల 62 లక్షల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్లను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 6వ తేదీ నుంచి గ్రామాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, లబ్ధిదారులను గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్?ఎస్? ప్రభుత్వం ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుంపటిగా మార్చిందని మండిపడ్డారు. ప్రతి నెల రూ.6 వేల 500 వందల కోట్లు అసలు, వడ్డీ కలిపి చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్? కార్డు లేని వారికి ప్రభుత్వం ఇటీవల గుడ్? న్యూస్? చెప్పింది. రేషన్ ?కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని స్పష్టం చేసింది. మొదటి విడతలో వీరికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని స్వయంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గతంలో వెల్లడించారు. రేషన్? కార్డు లేని పేద ప్రజలకు ఇది నిజంగా శుభవార్తనే చెప్పాలి. ఖమ్మం జిల్లా కూసుమంచిలోని క్యాంప్? కార్యాలయంలో గత నెలల జరిగిన నియోజకవర్గ పరిధి సమావేశంలో ఈ ప్రకటన చేశారు. తిరుమలాయపాలెం మండలం కాంగ్రెస్? శ్రేణులు, అధికారుల సంయుక్త సమావేశం నిర్వహించారు. కాగా గతంలో రేషన్ ?కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని స్పష్టం చేసింది. మొదటి విడతలో వీరికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని స్వయంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రేషన్? కార్డు లేని పేద ప్రజలకు ఇది నిజంగా శుభవార్తనే చెప్పాలి. ఖమ్మం జిల్లా కూసుమంచిలోని క్యాంప్? కార్యాలయంలో సోమవారం జరిగిన నియోజకవర్గ పరిధి సమావేశంలో ఈ ప్రకటన చేశారు. తిరుమలాయపాలెం మండలం కాంగ్రెస్? శ్రేణులు, అధికారుల సంయుక్త సమావేశం నిర్వహించారు.

# గ్లోబల్ సిటీగా హైదరాబాద్



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మార్చాలనేది తమ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. గత ప్రభుత్వం మాయమాటలు చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. హైదరాబాద్ నగర సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించి, నగరానికి కావలసిన మౌలిక సదుపాయాలపై తాము ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూసేలా మూసీ సుందరీ కరణ పేరుతో నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి విషయంలో తాము వెనుకడుగు వేయబోమన్నారు. హైదరాబాద్ నగరం అంటేనే దేశంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు గల నగరంగా పేరుగాంచిందన్నారు. ఈ నగరం ఎందరో యువకులకు ఉపాధినిస్తుందని, ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు ఎందరో నాయకులు, ఐటీ కంపెనీలను హైదరాబాద్ కు తీసుకువచ్చి నగరం అభివృద్ధికి దోహద పడ్డారన్నారు. పిజెఆర్ వల్లే గోదావరి జలాలు నగరానికి వచ్చాయని తెలిపారు. న్యూయార్క్, టోక్యో వంటి నగరాలకు పోటీనిచ్చే సత్తా ఉన్న నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సీఎం తెలిపారు. ఎన్నో కంపెనీలు ఇక్కడ ఉన్నాయని, ప్రభుత్వానికి 65 శాతం ఆదాయం ఇక్కడి నుండే వస్తుందన్నారు. తెలంగాణ మణిహారంగా రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం సాగిస్తున్నామని, 7 వేల కోట్లతో హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి హోదాలో గల సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డి, కేంద్రంతో మాట్లాడి ఒక్క రూ.10 వేల కోట్లు తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మూసీ ప్రక్షాళన పేరిట తాము నిర్వాసితులకు అండగా నిలబడుతుంటే, అక్కడికి వెళ్లి నిద్రలు చేయడం మాని కేంద్రం నుండి నిధులు తీసుకురావాల్సిన భాద్యత కిషన్ రెడ్డిపై ఉందన్నారు. ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా కిషన్ రెడ్డి తీసుకు రాలేదని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం సహకారం కావాలని, నిధులు తెస్తరా? గుజరాత్ కు వలసపోతారా? మూసీ ప్రక్షాళనకు కేంద్రం నుంచి ఎంత నిధులు తీసుకొస్తవ్ అంటూ సీఎం ప్రశ్నించారు. పదేళ్లు తెలంగాణను భ్రష్టు పట్టించిన కేసీఆర్ ఇప్పుడు ఫామ్ హౌస్ కి పరిమితమై, తాము చేసే అభివృద్ధికి అడ్డు పెట్టడం ఎలా అంటూ ఆలోచిస్తున్నారని సీఎం రేవంత్ అన్నారు. ట్యాంక్ బండ్ నీరు పాలమాదిరిగా మారుస్తామని హామీలిచ్చి, పదేళ్లు అప్పుల ఊబిలోకి నెట్టేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. బీఆర్ ఎస్ , బీజేపీలపై చర్చించేందుకు



తాను సిద్ధమని, మీ పాలసీ డాక్యుమెంట్ ను తెలంగాణ సమాజానికి చూపించండంటూ సీఎం సవాల్ విసిరారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి తాము కట్టుబడి, వేల కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉప ముఖ్యమంత్రి అధ్వర్యంలో మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేస్తామని, అఖిల పక్ష సమావేశం సైతం నిర్వహిస్తామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లు ఏమేమి సలహాలు ఇస్తారో ఇవ్వండి అంటూ సీఎం పిలుపునిచ్చారు. రాజధాని గుండా ప్రవహిస్తున్న మూసీ నదికి పునరుజ్జీవం తీసుకువచ్చి మురికి కూపంలో ఉన్న ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతామన్నారు. దాంతో పాటు హైదరాబాదు నగరాన్ని గ్లోబల్ సిటీగా మార్చి పర్యాటకంగా, అందంగా అభివృద్ధి చేసి, మూసిని జీవ నదిగా మార్చాలని తమ ప్రభుత ముందుకుపోతందన్నారు. ఇది ప్రతిపక్షాలకు ఇష్టం లేదని అందుకే అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం గుండా 55 కిలోమీటర్ల పైగా ప్రవహిస్తున్న మూసీ నదిని పూర్తిగా ప్రక్షాళన చేసి పునరుజ్జీవం తీసుకురావడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతున్నది. గోదావరి నీళ్లను తీసుకువచ్చి మూసీలో కలిపి పునరుజ్జీవం తీసుకువస్తామన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి విద్య ఉపాధి అవకాశాలు పెంచుతామన్నారు. ౕత ప్రభుత్వాలు చేసిన అభివృద్ధికి రంగులు వేసుకుని పదేళ్లు కాలం వెళ్లదీశారని ఆరోపించారు. పదేళ్లు పాలించి పది పైసలు కూడా నగరం కోసం ఖర్చు చేయని బిఆర్ఎస్ పాలకులకు విమర్శలు చేసే అర్హత లేదన్నారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం తో పాటు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, నగరవాసులకు ఇప్పుడు అందుతున్న గోదావరి, కృష్ణ, మంజీరా నీటి పథకాలు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు తెచ్చిన ఫలితమేనని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కాగా ప్రజా పరిపాలన విజయోత్సవాల్లో భాగంగా పలు ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో రూ.5827 కోట్లతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. గ్రేటర్ పరిధిలో రూ.150 కోట్లతో పలు సుందరీకరణ పనులు, రూ.3,500 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.16.50 కోట్లతో నిర్మించిన భూగర్భ సంపులను ఆయన ప్రారంభించారు. దేశంలోనే అతిపెద్ద ఎస్టీపీని ముఖ్యమంత్రి ప్రారంభించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ చేపట్టబోయే 6 జంక్షన్ల అభివృద్ధి, 7 ఫ్లైఓవర్లు, అండర్ పాస్ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు భద్రత కిట్లను ఆయన అందించారు. అంతే కాకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంటిగ్రేషన్‌తో కూడిన కొత్త ఆన్‌లైన్ బిల్డింగ్ అప్రూవల్, లేఅవుట్ అప్రూవల్ సాఫ్ట్‌వేర్‌ను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ విధానం ఫిబ్రవరి 2025 నుంచి అమల్లోకి రానుంది. హైదరాబాద్ సింది.

## హరీశ్‌రావుపై పంజాగుట్టలో కేసు నమోదు

మంత్రి హరీశ్‌రావుతో పాటు టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన రాధాకిషన్ రావుపై కూడా కేసు నమోదైంది. 120 (బీ), 386,409,506 , రెడ్ విత్ 34, ఐటీ యాక్ట్ సెక్షన్ల కింద పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. మిస్టర్ రేవంత్ రెడ్డి అడుగడుగునా నువ్వు చేస్తున్న అన్యాయాలను నిలదీస్తున్నందుకు, నీ నిజ్వస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నందుకు, ప్రజల పక్షాన నీ మీద ప్రశ్నలు సంధిస్తున్నందుకు భరించలేక, సహించలేక నామీద అక్రమ కేసులెన్నో బనాయిస్తున్నావని మండిపడ్డారు. నీకు చేతనైంది ఒక్కటే.. తప్పు చేసి దబాయించడం, తప్పుడు కేసులు బనాయించడమని విమర్శించారు. నీ రెండు నాల్కల వైఖరిని బట్టబయలు చేసినందుకు, ప్రజాక్షేత్రంలో నిలదీసినందుకు తట్టుకోలేక ఇవాళ పంజాగుట్ట స్టేషన్‌లో మరో తప్పుడు కేసు పెట్టించారని మండిపడ్డారు. నువ్వు లక్ష తప్పుడు కేసులు పెట్టించినా, నేను ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపనని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రజా కోర్టులో, ప్రజా తీర్పుతో నీకు తగిన శిక్ష పడేంత వరకు ఆగనని తెలిపారు.

### మహారాష్ట్ర సీఎంగా

## దేవేంద్ర ఫడ్నవీస్!

దేవేంద్ర ఫడ్నవీసే ఖాయంగా తెలిసింది. ప్రస్తుతం ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న ఏక్‌నాథ్ షిండే .. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టబోతున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. డిసెంబర్ 5న ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని సదరు వర్గాలు స్పష్టం చేశాయి. అయితే, కేబినెట్ కూర్పు ఇంకా పూర్తి కాని కారణంగా.. ఆ రోజు సీఎం, ఇద్దరు డిప్యూటీ సీఎంలు మాత్రమే ప్రమాణం చేస్తారని సదరు వర్గాలు తెలిపాయి. సీఎంగా ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌ల ప్రమాణ స్వీకారం ఉంటుందని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంటోంది. కాగా, ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. కూటమిలోని బీజేపీకి 132 సీట్లు, షిండే సేనకు 57, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 41 సీట్లు దక్కాయి. ఈ నేపథ్యంలో అత్యధిక సీట్లు సాధించిన బీజేపీనే ఈసారి సీఎం పదవి చేపట్టబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీసే మహా తదుపరి ముఖ్యమంత్రి కావడం దాదాపు ఖాయమైనట్లు సమాచారం. అయితే, ఇందుకు షిండే వర్గం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఈ కారణంగానే మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం జరుగుతున్నట్లు కనిపిస్తోంది.

### భారత్,చైనాల మధ్య

## సంబంధాలు బలోపేతం

మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. చైనా చర్యల కారణంగా 2020లో సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతతకు భంగం వాటిల్లిందని, అప్పటినుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయన్నారు. సరిహద్దులో శాంతి, స్థిరత్వం లేకుండా ఇరు దేశాల సంబంధాలు సాధారణంగా ఉండలేవని మన ప్రభుత్వం స్పష్టంగా పేర్కొందన్నారు. వీటికి సంబంధించి భారత్‌కు స్పష్టమైన వైఖరి ఉందన్న ఆయన.. న్యాయమైన, సహేతుక, పరస్పర ఆమోదయోగ్య పరిష్కారం కోసం చైనాతో చర్చలు జరిపేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. లాజిస్టికల్ సవాళ్లు, కొవిడ్ పరిస్థితులు ఉన్నప్పటికీ.. మన బలగాలు చైనాను కట్టడి చేశాయని చెప్పారు. అయితే, నిరంతర దౌత్య చర్చల ఫలితంగా ఇరుదేశాల మధ్య సంబంధాల్లో ఇటీవల కొంత మెరుగుదల కనిపించిందని లోక్‌సభలో వివరించారు. 'ఏప్రిల్-మే 2020లో తూర్పు లద్దాఖ్‌లోని అనేక ప్రాంతాల్లో చైనా భారీ సంఖ్యలో బలగాలను మోహరించడం తీవ్ర ఘర్షణకు దారితీసింది. గల్వాన్ లోయలో ఘర్షణల అనంతరం సరిహద్దు గస్తీ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లాజిస్టికల్ సవాళ్లు, కొవిడ్ పరిస్థితులు ఉన్నప్పటికీ.. మన బలగాలు వేగంగా, సమర్థవంతంగా స్పందించి చైనాను కట్టడి చేశాయి. ఇలా తమ సామర్థ్యాలతో ఓ వైపు దీటుగా ప్రతిస్పందిస్తూనే, ఉద్రిక్తతలు తగ్గించడం కోసం పొరుగు దేశంతో దౌత్యపరమైన చర్చలకు ప్రయత్నాలు చేశాం' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.




### నేర నియంత్రణ చట్టాలు

## బలమైన ముందడుగు

అని పేర్కొన్నారు. 'చండీగఢ్‌కు వస్తే.. నా మనుషుల మధ్యకు వచ్చినట్లు ఉంటుంది. ఈ నగరం శక్తిస్వరూపిణి చండీ అమ్మవారి పేరుతో ముడిపడింది. ఆమె సత్యం, న్యాయాన్ని నిలబెట్టారు. ఇదే భావనతో భారత న్యాయసంహిత చట్టాలు ఉన్నాయి. వీటి పరిధిలోకి దేశం రావడం చాలా గొప్ప ఆరంభం. ప్రజల కోసం మన రాజ్యాంగా ఏమి ఆదర్శాలను ఊహించుకున్నామో వాటిని పూర్తి చేయడానికి ఇవొక కీలక ప్రయత్నం. ఈ చట్టాలు ఎలా అమలు చేస్తారనేది లైవ్ డెమో చూశాను. ప్రజలు కూడా వీటిని చూడాలని కోరుతున్నానని అన్నారు. దేశంలోని సరికొత్త న్యాయసంహిత చట్టాలు సమగ్రమైనవి. వీటిని తయారీ పక్రియ కూడా చాలా విస్తృతంగా ఉంది. దీనిలో ఎంతో మంది నిపుణుల కష్టం దాగి ఉంది. హోమ్ మంత్రిత్వశాఖ 2020 జనవరిలో అభిప్రాయాలు కోరింది. సుప్రీం కోర్టు, హైకోర్టులు, న్యాయవిద్యాలయాలు, పౌర సంస్థలు, మేధావులు ఏళ్ల తరబడి చర్చించి, తమ అనుభవాలను రంగరించారు. గతంలో ఎదురైన సవాళ్లను విశ్లేషించారు. భవిష్యత్తుకు సరిపడా ప్రమాణాలను దానిలో చేర్చారు. ఇది మన న్యాయ యాత్రలో మైలురాయిగా మిగులుతుంది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా మంగళవారం ఉదయమే నగరంలోని పంజాబ్ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకొన్నారు. ఈ సందర్భంగా వారు ఆధారాలు ఎలా సేకరిస్తారో తెలియజేస్తూ పోలీసులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను వీక్షించారు. పంజాబ్ సీనియర్ ఎస్పీ కన్వర్‌దీప్ కౌర్ ప్రధానికి కీలక విషయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ గవర్నర్ గులాబ్ ఛాంద్ కటారియా పాల్గొన్నారు.

## చరమ గీతం పాడి ఏడాది

రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మిగతా మంత్రుల సమిష్టి నిర్ణయాలతో తొలి ఏడాది అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో వెలిగిపోతోందన్నారు. ప్రస్తుతం రైజింగ్ తెలంగాణగా ఉందన్న విషయం ప్రజలకు అందరికి తెలుసన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయలేనంత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు టీపీసీసీ. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత సదుపాయం, ఆరోగ్య శ్రీ 10 లక్షల పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ కనెక్షన్ ఇచ్చి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ కోసం 21 వేల కోట్ల రూపాయల కేటాయించిందన్నారు. దీని ద్వారా 23 లక్షల మందికి లబ్ది జరిగిందన్ని విషయాన్ని వక్కానించారు మహేష్‌కుమార్. ధాన్యం 500 రూపాయల బోనస్‌తో రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఒక్క ఏడాదిలో సుమారు 54 వేల 500 ఉద్యోగాలు ఇచ్చి యువతను అదుకుందని, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ లు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. డ్రగ్స్ నివారణకు కృషి జరుగుతోందని వివరించారు. ఇక మూసీ నది పునర్జీవనం ఒక అద్భుతమైన పథకంగా వర్ణించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఓ వైపు పథకాలు.. మరోవైపు అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే QUICK TODAY

బుధవారం 4 డిసెంబర్ 2024 quicktodaynews.com



### ఢిల్లీకి రావాలంటేనే

## విసుగు కలుగుతోంది!

**కాలుష్యం కారణంగా ఇన్‌ఫెక్షన్ సోకుతుంది**

**కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, డిసెంబర్3:** దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యస్థాయి తీవ్రంగా పెరుగుతుండటంతో ఇక్కడకు రావాలంటేనే విసుగు కలుగుతోందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. తనకు ఢిల్లీలో నివసించడం ఏమాత్రం ఇష్టం ఉండదన్నారు. కాలుష్యం కారణంగా ఇన్‌ఫెక్షన్ సోకుతుండటంతో తనకు ఢిల్లీకి రావాలనిపించడం లేదన్నారు. ఢిల్లీలో కాలుష్యం బాగా ఉందన్నారు.తాను ఢిల్లీకి వచ్చే ప్రతిసారీ కాలుష్యం భయంతో వెళ్లాలా? వద్దా? అని ఆలోచిస్తుంటానన్నారు. శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడమే కాలుష్య నివారణకు ఉత్తమ మార్గమన్నారు. మన దేశం ప్రస్తుతం రూ.22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటోందన్నారు. లక్షల కోట్ల విలువైన దిగుమతుల నేపథ్యంలో ఈ ప్రభావం మన ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, జీవావరణంపై పడుతోందన్నారు. ప్రత్యామ్నాయ ఇంధనాలను ప్రోత్సహించడం ద్వారా శిలాజ ఇంధనాల దిగుమతులను తగ్గించుకోవచ్చని వ్యాఖ్యానించారు.

## తుప్రాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**బైక్‌ను ఢీకొట్టిన ట్యాంకర్..**

**మెదక్, నవంబర్ 3 (క్విక్ టుడే న్యూస్):** బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో బైకర్ తీవ్రంగా గాయపడ్డారు. దశరథ్ అనే వ్యక్తి బైక్‌పై మున్సిపల్ ఆఫీస్ వైపు వెళ్తున్నారు. అతని వెనకాలే ఓ టిప్పర్ వస్తున్నది. నర్సాపూర్ చౌరస్తా వద్ద టిప్పర్ ఎడమవైపు టర్న్ తీసుకుంటున్నది. అయితే అదేసమయంలో స్ట్రెయిట్‌గా వెళ్తున్న బైక్‌ను గమనించకుండా టిప్పర్ డ్రైవర్ ఎడమవైపు మళ్లారు. దీంతో ద్విచక్ర వాహనంపైనుంచి లారీ వెళ్లిపోయింది. ఈ క్రమంలో బైక్ ట్యాంకర్ పేలడంతో మంటలు చెలరేగాయి. అప్పటికే గాయపడిన దశరథ్‌కు మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేసి.. అతడిని దవాఖానకు తరలించారు. ఇదంతా సమీపంలో ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డయింది. ఈ యాక్సిడెంట్ ఎప్పుడు జరిగిందో తెలియనప్పటకీ.. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

## శ్రీశైలంలో విఐపీల దర్శనాలు రద్దు

**నంద్యాల, నవంబర్ 3 (క్విక్ టుడే న్యూస్):** శ్రీశైలం దేవస్థానం సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ సెలవులు, భక్తులు రద్దీగా ఉండే శని, ఆది, సోమవారాలలో, వైదిక కమిటీ నిర్ధారించిన రోజుల్లో వీఐపీ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా రోజుల్లో భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం మాత్రమే ఉంటుందని ఈవో వెల్లడించారు. శని, ఆది, సోమవారాలు, రద్దీ రోజుల్లో ఉదయాస్తమాన, ప్రదోషకాల, ప్రాతకాల, గర్భాలయ, సామూహిక అభిషేకాలు, స్పర్శ దర్శనం, వీఐపీ బ్రేక్ దర్శనాలు నిలుపుదల చేస్తూ ఆలయ ఈవో ఆదేశాలు జారీ చేశారు. సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. వైదిక కమిటీ నిర్ధారించిన రోజుల్లో స్పర్శదర్శనం, అభిషేకాల రద్దు వివరాలను క్యాలెండర్ రూపంలో విడుదల చేయనున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు.

## తిరుపతిలో విరిగిపడ్డ కొండచరియలు

**తిరుపతి, నవంబర్ 3 (క్విక్ టుడే న్యూస్):** తిరుమలలో కొండ చర్యలు విరిగిపడ్డాయి. మట్టి, బండరాళ్లు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. రెండో ఘాట్ రోడ్డులోని లింక్ రోడ్డు దగ్గర ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో అటు వైపు వెళ్లే ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే సమాచారం అందుకున్న టీటీడీ, ఫారెస్ట్ సిబ్బంది వాటిని తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. చిత్తూరు జిల్లాపై ఫెంగల్ తుఫాన్ తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఫెంగల్ దెబ్బతో జనజీవనం అతలాకుతలం అవుతోంది. భారీ వర్షాలకు పలు రోడ్డు దెబ్బతిన్నాయి. ఇప్పటికే చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వరి, టమాటా, అరటి, కూరగాయ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దాదాపు 1500 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.దాదాపు 1500 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. కల్లాల్లో వరి పంట తడిసి మొలకెత్తుతోన్న పరిస్థితి ఏర్పడింది. నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## తాజ్ మహల్‌కు బాంబు బెదిరింపు

**ఉత్తరప్రదేశ్ టూరిజం కార్యాలయానికి ఈమెయిల్**

**అప్రమత్తమైన టూరిజం అధికారులు, పోలీసులు**

**న్యూఢిల్లీ, డిసెంబర్3:** గత కొంతకాలంగా బాంబు బెదిరింపు కాల్స్ ఎక్కువయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు దేశంలోని పలు విమానాశ్రయాలు, విమానాల్లో బాంబు ఉన్నట్టుగా బెదిరింపు కాల్స్ చేసిన ఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. దుండగుల బెదిరింపు కాల్స్‌తో అటు ప్రజలు, ఇటు అధికార యంత్రాంగాన్ని టెన్షన్‌లో పడేస్తుంటారు. తాజాగా ప్రపంచంలోని ఏడు వింతల్లో ఒకటైన తాజ్ మహల్‌కు బాంబు బెదిరింపు మెయిల్ రావటం కలకలం రేపింది. తాజ్ మహల్ ను పేల్చివేస్తామంటూ ఉత్తరప్రదేశ్ టూరిజం కార్యాలయానికి ఓ ఈమెయిల్ అందింది. వెంటనే అప్రమత్తమైన టూరిజం అధికారులు, పోలీసులు రంగంలోకి దిగారు. ఆగ్రాలోని తాజ్ మహల్‌ను బాంబులతో పేల్చేస్తామని గుర్తు తెలియని వ్యక్తులు మెయిల్ చేసినట్టుగా అధికారులు వెల్లడించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తాజ్ మహల్ వద్ద బాంబ్ డిస్పోజల్ టీమ్‌లు, డాగ్ స్క్వాడ్స్‌తో రంగంలోకి దిగారు. తాజ్‌మహల్ పరిసర ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్, ఇతర బృందాలు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాయి. కానీ అక్కడ అనుమానస్పద వస్తువులు ఏమీ కూడా కనపించలేదని అధికారులు వెల్లడించారు. తాజ్‌మహల్‌కు వచ్చిన బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై విచారణ చేస్తున్నామని ఏసీపీ తాజ్ సెక్యూరిటీ సయ్యద్ అరీబ్ అహ్మద్ తెలిపారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మెయిల్ వచ్చిన వెంటనే ఆగ్రా పోలీసులకు, ఇతర ఉన్నతాధికారులకు సమాచారం అందించామని ఉత్తరప్రదేశ్ డిప్యూటీ డైరెక్టర్ దీప్తి వాత్స పేర్కొన్నారు.

## పుష్ప-2 టిక్కెట్ ధరల పెంపు

**ధరల పెంపుపై నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశం**




**హైదరాబాద్, డిసెంబర్3 (క్విక్ టుడే న్యూస్):** టాలీవుడ్ సినీ నటుడు అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమా టికెట్ ధరలు పెంపుపై హైకోర్టులో విచారణ జరిగింది. బెనిఫిట్ షో లకు భారీగా టికెట్ ధరలు పెంచారని, సామాన్యులు మూవీ చూసే పరిస్థితి లేదని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పూర్తి వివరాలు రెండు వారాల్లో సమర్పించాలని మైత్రి మూవీస్ కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్కూల్ డేస్ లో రిలీజ్ రోజే సినిమా చూసిన సందర్భాలు ఉన్నాయన్న న్యాయమూర్తి..ఇప్పట్లో కుటుంబం మొత్తం సినిమా వీక్షించాలంటే 8 వేలు రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.పుష్ప 2 బెనిఫిట్ షో ద్వారా వచ్చే నగదు ఎక్కడికి మళ్లిస్తున్నారని పిటిషనర్ ప్రశ్నించారు. అయితే, పూర్తి నివేదిక పరిశీలించి ఆదేశాలు ఇస్తామని హైకోర్టు తెలిపింది. జీవోలను సైతం పరిశీలిస్తామని పేర్కొంది. రాత్రి 10 గంటలకు షో వేస్తే మధ్యరాత్రి 1 అవుతుందని పిల్లలకు నిద్ర అవసరమని హైకోర్టు అభిప్రాయపడింది. కాగా, పుష్ప-2 సినిమా టిక్కెట్ రేట్లను పెంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం అనుమతించిన సంగతి తెలిసిందే. ప్రీమియర్ షో టిక్కెట్ ధరపై రూ. 800 వరకు పెంచింది. డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు రూ. 200, ఆ తర్వాత కూడా టికెట్ ధరలు పెంచుకోవడానికి అవకాశం ఇచ్చింది. అయితే, ఈ సినిమా టిక్కెట్ రేట్లను భారీగా పెంచడంపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.పుష్ప-2 సినిమాలో అల్లు అర్జున్ సరసన నేషనల్ క్రష్ రష్మిక మందన్న జోడిగా నటించింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ సినిమాకు సుకుమార్ దర్శకుడుగా ఉన్నారు. డిసెంబర్ 5 న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది.

# 'ఫంగల్' తుఫాను తమిళనాడులో భారీ విధ్వంసం

**రాష్ట్రంలో సంభవించిన విపత్తు, భారీ నష్టం**

**పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో ప్రధాని ఆరా**

**రాష్ట్రానికి అన్ని విధాలా సాయం చేస్తామని హామీ**



**విల్లుపురం, డిసెంబర్3:** 'ఫంగల్' తుఫాను తమిళనాడులో భారీ విధ్వంసం సృష్టించింది. భారీ వర్షాలు, తుఫాను కారణంగా వరదలు రాష్ట్రంలో భారీ నష్టం కలిగించాయి. ఈ బీభత్సంలో చాలా మంది మరణించారు. రాష్ట్రంలో సంభవించిన విపత్తు, అక్కడి పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. రాష్ట్రానికి అన్ని విధాలా సాయం చేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. మంగళవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌తో ప్రధాని మోదీ మాట్లాడారని, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వరదల పరిస్థితిపై సమాచారం అందుకున్నారని ప్రభుత్వానికి సంబంధించిన అధికారిక వర్గాలు తెలిపాయి. స్టాలిన్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.తమిళనాడులోని ఉత్తర ప్రాంతంలోని విల్లుపురం జిల్లాలో సోమవారం భారీ నుంచి అతిభారీ వర్షాల కారణంగా అపూర్వమైన వరదలు సంభవించాయి. వంతెనలు, రోడ్లు నీటమునిగడంతో పలు గ్రామాలు, నివాస కాలనీలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేల ఎకరాల్లో వేసిన పంటలు కూడా నీట మునిగాయి. ఇదిలా ఉండగా, తిరువణ్ణామలైలో డిసెంబర్ 1 రాత్రి కురిసిన వర్షాల సమయంలో బురద జారడం, కొండపై నుండి పడిన రాయి కారణంగా ఐదు మృతి చెందారు. అంతకుముందు సోమవారం ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ, ఫెంగల్ తుఫాను రాష్ట్రంలో భారీ విధ్వంసం సృష్టించిందని అన్నారు. 2,000 కోట్ల మధ్యంతర సాయాన్ని వెంటనే విడుదల చేయాలని ప్రధాని మోదీని కోరారు. దెబ్బతిన్న మౌలిక సదుపాయాలు, జీవనోపాధిని తాత్కాలిక పునరుద్ధరణకు పరిపాలన ద్వారా ఈ మొత్తాన్ని ఉపయోగిస్తామని ఆయన చెప్పారు.ఫెంగల్ తుఫాను గత నెల నవంబర్ 23న అల్పపీడనంగా ఏర్పడి దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడులోని 14 జిల్లాల్లో భారీ విధ్వంసం సృష్టించింది. తొలుత తిరువారూరు, తంజావూరు, మైలాడుతురై, నాగపట్నం జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయని ప్రధాని మోదీకి రాసిన లేఖలో సీఎం స్టాలిన్ తెలిపారు.దీంతో పాటు రాజధాని చెన్నై, తిరువళ్లూరు, చెంగల్‌పట్టు, కాంచీపురం, విల్లుపురం తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఆ తర్వాత డిసెంబర్ 1న ఈ ప్రాంతాల్లో తుపాను తాకడంతో కడలూరు, కళ్లకురిచ్చి, విల్లుపురం, తిరువణ్ణామలైలో రోడ్లు, విద్యుత్ లైన్లకు భారీ నష్టం వాటిల్లింది. గంటకు 90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో పలుచోట్ల నేలకొరిగాయి. దీంతో పాటు అంతర్భాగంలోని ధర్మపురి, రాణిపేట, కృష్ణగిరి, వేలూరు, తిరుపత్తూరు జిల్లాల్లో కూడా భారీ వర్షాలు, వరదల వల్ల భారీ నష్టం వాటిల్లింది. ఈ ప్రకృతి వైపరీత్యం కారణంగా దాదాపు 69 లక్షల కుటుంబాలు, 1.5 కోట్ల మంది ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. సిఎం స్టాలిన్ ప్రకారం, తిరువణ్ణామలై, విల్లుపురం, కళ్లకురిచి జిల్లాల్లో ఒక్క రోజులో మొత్తం సీజన్ సగటు (50 సెం.మీ కంటే ఎక్కువ) కు సమానమైన వర్షపాతం నమోదైంది. దీని కారణంగా ఇక్కడ వరదలు వంటి పరిస్థితి ఏర్పడింది. మౌలిక సదుపాయాలు, పంటలకు భారీ నష్టం జరిగింది. ఈ జిల్లాల్లో సహాయ, సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు సీనియర్ మంత్రులు, అధికారులను నియమించగా, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) 9 బృందాలు, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) 9 బృందాలను మోహరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నష్టాలను ప్రాథమికంగా అంచనా వేసినప్పుడు తాత్కాలిక పునరుద్ధరణ ప్రయత్నాలకు దాదాపు రూ.2,475 కోట్లు అవసరమని తేలిందని సీఎం చెప్పారు.

# రఘురామ కృష్ణరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగం కేసు

**డాక్టర్ ప్రభావతి ముందస్తు బెయిల్‌పై విచారణ**



**అమరావతి, డిసెంబర్3 (క్విక్ టుడే న్యూస్):** ప్రస్తుత ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన కేసులో అప్పటి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి వేసిన ముందస్తు బెయిల్‌పై మంగళవారం జిల్లా కోర్టులో విచారణకు వచ్చింది. ఈ కేసులో తమను ఇంప్లీడ్ చేయాలని రఘురామ కృష్ణ రాజు పిటిషన్ వేశారు. రఘురామ తరపున హైకోర్ట్ న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ పిటిషన్ వేశారు. రఘురామపై థర్డ్ డిగ్రీ ప్రయోగంలో ప్రభావతి కూడా హత్యాయత్నంలో భాగస్వాములు అయ్యారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. రఘురామ కృష్ణం రాజును పరీక్షించిన వైద్య బృందం ఆయన కాలుపై బలమైన దెబ్బలు ఉన్నాయని నివేదిక ఇచ్చారని న్యాయవాది తెలిపారు. ఆయన రెండు కాళ్ళకు బలమైన దెబ్బలతో పాటు వాచి ఉన్నాయని పిటిషనర్ వెల్లడించారు. వైద్య బృందం ఇచ్చిన నివేదికను టాంపరింగ్ చేశారని, అందుకు భిన్నంగా నివేదిక ఇవ్వడం లో ప్రభావతి కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. బైపాస్ సర్జరీ చేయించకున్న అని చెప్పినప్పటికీ గుండెలపై కూర్చొని బాధారని చెప్పినప్పటికీ ప్రభావతి ఈ అంశాన్ని తొక్కి పెట్టారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అందువలనే ఆమెకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని పేర్కొంటూ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతించాలని న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ కోరారు. కాగా.. 2021 మే నెలలో సీఐడీ అధికారులు కస్టడీకి తీసుకుని చిత్రహింసలకు గురిచేసి, హత్యాయత్నం చేశారని ఈ ఏడాది జూలైలో రఘురామ రాజు ఫిర్యాదు చేశారు. దీనిపై గుంటూరు నగరంపాలెం స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్, ఇంటెలిజెన్స్ చీఫ్ ఆంజనేయులు, సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్, అప్పటి సీఎం జగన్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ ప్రభావతి, మరి కొంతమందిని నిందితులుగా చేర్చారు. ఈ కేసుకు సంబంధించి ప్రభుత్వం ప్రకాశం జిల్లా ఎస్పీని విచారణాధికారిగా నియమించింది. ఈ క్రమంలో రిటైర్డ్ ఏఎస్పీ విజయ్‌పాల్‌ను ఇటీవల ఒంగోలోని ఎస్పీ కార్యాలయానికి పిలిపించి విచారణ జరిపారు. పోలీసులు అడిగిన అనేక ప్రశ్నలకు ఆయన సమాధానం ఇవ్వలేదు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు విచారణ జరిపిన పోలీసులు.. ఈ కేసుకు సంబందించి అనేక ప్రశ్నలు ఆయన ముందు ఉంచారు. అయితే దేనికి కూడా విజయ్ పాల్ సరైన సమాధానం ఇవ్వలేదు. విచారణ అనంతరం ఆయనను పోలీసులు అరెస్ట్ చేసి గుంటూరు కోర్టులో ప్రవేశపెట్టగా.. ఆయనకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో విజయ్ పాల్‌ను కోర్టు నుంచి గుంటూరు జిల్లా జైలుకు పోలీసులు తరలించారు. అయితే అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు విజయ్‌పాల్ అనేక ప్రయత్నాలు చేశారు. హైకోర్టులో ఆయనకు చుక్కెదురు కావడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ముందస్తు బెయిల్ కోసం విజయ్‌పాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే.

## నేను ఆరోగ్యంగానే ఉన్నా : ఏక్‌నాథ్ షిండే



**ముంబై, డిసెంబర్ 3:** తాను ఆరోగ్యంగానే ఉన్నానని, కేవలం వైద్య పరీక్షల కోసమే ఇవాళ ఆస్పత్రికి వెళ్లానని మహారాష్ట్ర కేర్ టేకర్ సీఎం ఏక్‌నాథ్ షిండే వెల్లడించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి 10 రోజులవుతున్నా కొత్త సీఎం ఎంపికపై ఇంకా సస్పెన్షన్ కొనసాగుతున్న వేళ ఆయన ఆస్పత్రిలో చేరడం పలు అనుమానాలకు తావిచ్చింది. సీఎం పదవిని బీజేపీకి వదులుకోవడం ఇష్టం లేకనే షిండే డ్రామాలు ఆడుతున్నారని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో ఆయన ఆస్పత్రి నుంచి బయటకు రాగానే తాను ఆరోగ్యంగానే ఉన్నానంటూ ప్రకటన చేశారు. కేవలం వైద్య పరీక్షల కోసమే ఆస్పత్రిలో చేరానని చెప్పారు. కాగా మహారాష్ట్ర సీఎం ఎంపికపై ఇంకా సస్పెన్షన్ కొనసాగుతోంది. కూటమిలో అతిపెద్ద పార్టీ అయిన బీజేపీకే ఈసారి సీఎం పదవి దక్కుతుందని, సీఎంగా ఫడ్నవీస్ పేరును బీజేపీ ఖాయం చేసిందని వార్తలు వినిపిస్తున్నా.. ఈ వార్తలపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, సీఎం పదవిపై బీజేపీ హైకమాండ్ తీసుకునే నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని ఇటీవల ఏక్‌నాథ్ షిండే ప్రకటించడంతో ఫడ్నవీస్‌కు సీఎం పదవి పక్కా అనేది తేలిపోయింది. దీనిపై బుధవారం అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. బుధవారం మహారాష్ట్ర బీజేపీ శాసనసభా పక్షం సమావేశమై సీఎంను ఎన్నుకోనుంది. ఈ సమావేశానికి గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బీజేపీ కేంద్ర పరిశీలకులుగా హాజరుకానున్నారు.

## బీజేపీ నిర్ణయం మార్చుకోదు

**ఏక్‌నాథ్ షిండే ముందు మూడు దారులున్నాయి**

**ఆర్పీఐ అధినేత, కేంద్రమంత్రి రాందాస్ అథవాలే**



**బాంబే, డిసెంబర్3:** మహారాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ముందు మూడు దారులు ఉన్నాయని ఆర్పీఐ అధినేత, కేంద్రమంత్రి రాందాస్ అథవాలే అన్నారు. ఉపముఖ్యమంత్రి పదవిని తీసుకోవడం లేదా మహాయుతి కూటమి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించడం లేదా కేంద్ర ప్రభుత్వంలో స్థానం కోరుకోవడం... ఈ మూడింటిలో ఏదో ఒకటి ఆయన ఎంచుకోవాలన్నారు. ఈసారి బీజేపీయే ముఖ్యమంత్రి పదవిని తీసుకుంటుందని అథవాలే స్పష్టం చేశారు. ఆపద్ధర్మ సీఎంగా ఉన్న షిండేకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చే అవకాశముందన్నారు.క్రితంసారి శివసేన పార్టీ రెండుగా చీలిపోయినప్పుడు బీజేపీకి ఎక్కువ బలం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పీఠాన్ని ఏక్?నాథ్ షిండేకు ఇచ్చారని గుర్తు చేశారు. బీజేపీ అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవించి ఫడ్నవీస్ డిప్యూటీ సీఎంగా కొనసాగారన్నారు. కానీ ఈసారి కూడా సీఎం పదవిని శివసేనకు ఇచ్చేందుకు బీజేపీ సిద్ధంగా లేదని స్పష్టం చేశారు. బీజేపీ గతంలో కంటే ఈసారి ఎక్కువ స్థానాలను గెలుచుకుందన్నారు.మరోసారి ముఖ్యమంత్రి పదవిని ఇచ్చేందుకు మహాయుతి కూటమిలోని బీజేపీ అధిష్ఠానం సుముఖత వ్యక్తం చేయకపోవడంతో ఏక్‌నాథ్ షిండే కలత చెందిన మాట వాస్తవమే అన్నారు. అయినప్పటికీ బీజేపీ తన నిర్ణయాన్ని మార్చుకునే పరిస్థితి లేదన్నారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమికి 230 సీట్లు రాగా... అందులో బీజేపీ 132, శివసేన 57, ఎన్సీపీ 41 సీట్లు దక్కించుకున్నాయి.

## ఏపీకి మరో తుఫాన్ ముప్పు

**రెండోవారంలో వాయుగుండం ఏర్పడే చాన్స్**

**వాతావరణశాఖ వెల్లడి**

**అమరావతి, డిసెంబర్3 (క్విక్ టుడే న్యూస్):** ఏపీని ఓ వైపు ఫెంగల్ తుపాను భయపడుతుండగా.. వాతావరణ శాఖ అధికారులు మరో బాంబు పేల్చారు . ఏపీకి ఫెంగల్ ముప్పు తక్కువే అయినా.. మరో ముప్పు పొంచి ఉందని ప్రకటించారు. డిసెంబర్ రెండో వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడబోతోందని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. ఈ అల్పపీడనం వాయుగుండంగా మారి తుపానుగా పరిణమించే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావం ఏపీపై అధికంగా ఉండే అవకాశం ఉందని అంచనా వేశారు. ఫెంగల్ తుపాను తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను వణికిస్తోంది. ఈ తుపాను ప్రభావంతో తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఏపీలో పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడుతున్నాయి. నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. మంగళవారం నాడు కూడా దక్షిణ కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడుతాయని అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఫెంగల్ తుపాను బలహీనపడుతోందని.. క్రమంగా అరేబియా సముద్రం వైపు కదులుతోందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అయితే, ఫెంగల్ తుపాను ఏపీపై పెద్దగా ప్రభావం చూపక పోయినా.. మరో ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఓవైపు ఫెంగల్ తుపాను ప్రభావం కొనసాగుతుండగానే.. మరో ముప్పు ముంచుకొస్తోంది. నైరుతి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ వెల్లడించింది. డిసెంబర్ రెండో వారంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయుగుండంగా బలపడనుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావం ఏపీలోని దక్షిణ కోస్తాంధ్ర జిల్లాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. తీర ప్రాంత జిల్లాలో భారీ వర్షం కురిసే ఛాన్స్ ఉందంటున్నారు

## 'షిండే మళ్లీ సీఎంగా రావాలి' అంటూ బ్యానర్లు




**బాంబే, డిసెంబర్3:** మహారాష్ట్రలో గురువారం నాడు నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవానికి ఓవైపు ఏర్పాట్లు జరుగుతున్నప్పటికీ, సీఎం పదవి విషయంలో అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంగా ఏక్ నాథ్ షిండే... వీలైతే మరో డిప్యూటీ సీఎంగా అజిత్ వార్... ప్రస్తుతానికి ఈ సమీకరణం ప్రచారంలో ఉంది. బీజేపీ హైకమాండ్ చెప్పిన మాట వింటానని ఏక్ నాథ్ షిండే చెబుతున్నప్పటికీ, షిండేనే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని బ్యానర్లు వెలిశాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇదొక ఆసక్తికర పరిణామం. తాజాగా ఛత్రపతి శంభాజీ నగర్ లో షిండే బొమ్మతో భారీ బ్యానర్లు, హోర్డింగ్ లు దర్శనమిచ్చాయి. ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండేనే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలంటూ ఆ బ్యానర్లపై పేర్కొన్నారు. అంతేకాదు, షిండేను 'మరాఠా సర్దార్' అని అభివర్ణించారు. ఔరంగాబాద్ లోని జాల్నా రోడ్ లో ఉన్న బాంబే హైకోర్టు బెంచ్ సమీపంలోనూ బ్యానర్లు కనిపించాయి. వీటిని సకల్ మరాఠా సమాజ్ అనే సంస్థ ఏర్పాటు చేసింది. ఈ సంస్థ గత కొన్నాళ్లుగా మరాఠా రిజర్వేషన్ల కోసం పోరాడుతోంది.

RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

CINEMA

QUICK TODAY
quicktodaynews.com

బుధవారం 4 నవంబర్ 2024





# కొండగట్టు అంజన్నను దర్శించుకున్న వరుణ్‌తేజ్

కొండగట్టు అంజన్న ఆలయాన్ని మెగా హీరో వరుణ్ తేజ్ సందర్శించారు. మంగళవారం ఉదయం ఆలయం వద్దకు చేరుకున్న వరుణ్ తేజ్‌కు అర్చకులు, అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో వరుణ్ తేజ్ ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంజన్నను దర్శించుకోవడం ఆనందంగా ఉందని వరుణ్ తేజ్ తెలిపారు. కాగా, వరుణ్ తేజ్ కాంపౌండ్ నుంచి పీరియాడిక్ బ్యాక్ డ్రాప్‌లో వచ్చిన చిత్రం మట్కా . పలాస 1978 ఫేం డైరెక్టర్ కరుణకుమార్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి ఫీమేల్ లీడ్ రోల్స్‌లో నటించారు. తెలుగు, తమిళంతోపాటు వివిధ భాషల్లో భారీ అంచనాల మధ్య నవంబర్ 14న గ్రాండ్‌గా రిలీజైన ఈ చిత్రం డిజాస్టర్‌గా నిలిచింది. వరుణ్ తేజ్ పర్‌ఫార్మెన్స్ పరంగా అదరగొట్టినా.. కథనం బెడిసి కొట్టడంతో బాక్సాఫీస్ వద్ద ఊహించని ఫ్లాప్ టాక్ మూటగట్టుకుంది. థియేటర్స్‌లోకి వచ్చి నెలరోజులు కూడా కాకుండానే ఓటీటీ రిలీజ్‌కు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా డిసెంబర్ 05 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.



## ఇద్దరిని హత్య చేసిన నటి సోదరి

బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ సోదరి అలియాను న్యూయార్క్ పోలీసులు అరెస్టు చేశారు. గత నెల మాజీ బాయ్‌ఫ్రెండ్, అతడి స్నేహితురాలిని అలియా సజీవ దహనం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసులో ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు. న్యూయార్క్‌లో ఉంటున్న అలియా ఫక్రీ కొంతకాలం పాటు ఎడ్వర్డ్ జాకోబ్ అనే యువకుడితో డేటింగ్‌లో ఉంది. పలు కారణాలతో ఏడాది క్రితం విడిపోయారు. అనంతరం జాకోబ్‌కు అనాస్టాసియా ఎటినీ అనే యువతితో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ సన్నిహితంగా ఉంటున్నట్లు తెలుసుకున్న అలియా పలుమార్లు తన మాజీ బాయ్‌ఫ్రెండ్‌పై బెదిరించసాగింది. నవంబరు 2న జాకోబ్ ఆయన స్నేహితులు ఉంటున్న భవనం వద్దకు వెళ్లి ఆ ఇంటికి నిప్పంటించింది. దీన్ని గమనించిన స్థానికులు వారిని అప్రమత్తం చేశారు. అయితే అప్పటికే మంటల్లో చిక్కుకుని వారిద్దరూ ప్రాణాలు విడిచారు. ప్రత్యక్ష సాక్షుల రిపోర్ట్‌తో కేసు నమోదు చేసుకున్న పోలీసులు తాజాగా అలియా ఫక్రీని అరెస్టు చేశారు. ఈ కేసులో ఆమె దోషిగా తేలితే జీవిత ఖైదు పడే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఆమెను రిమాండ్‌కు తరలించారు. తదుపరి విచారణను డిసెంబర్ 9వ తేదీకి వాయిదా వేశారు. సోదరి అరెస్టుపై నర్గీస్ ఫక్రీ నుంచి ఎలాంటి స్పందన లేదు.



### పుష్ప-2 టికెట్ పెంపునకు
## ఏపీ ప్రభుత్వం అనుమతి

అల్లు అర్జున్, రష్మిక జంటగా నటించిన పుష్ప-2 సినిమా ఈనెల 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతుంది. ఇందులో భాగంగా ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం టికెట్ ధరలను పెంచగా అదేబాటలో ఏపీ ప్రభుత్వం కూడా పుష్ప-2కు ధరల పెంపునకు అనుమతిచ్చింది. డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటలకు బెనిఫిట్ షోతో పాటు, అర్ధరాత్రి 1 గంట షోలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రెండు బెనిఫిట్ షోలకుగాను ఏపీ వ్యాప్తంగా ఉన్న సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్‌లలో ఏదైనా సరే టికెట్ ధర రూ. 800గా నిర్ణయించింది. ఈ ధరకు జీఎస్టీ అధనంగా ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. డిసెంబర్ 5న ఆరు షోలకు అనుమతి ఇస్తూ జీవో జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సింగిల్ స్క్రీన్‌లలో లోయర్‌క్లాస్ రూ.100, అప్పర్ క్లాస్ రూ.150, మల్టీప్లెక్స్‌లో రూ.200 పెంచారు. ఇక్కడ కూడా జీఎస్టీతో కలిపి టికెట్లు కొనాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ధరలు అన్నీ కూడా ప్రస్తుతం ఉన్న టికెట్ ధరలకు అదనంగా యాడ్ అవుతుందని, డిసెంబర 17 వరకు మాత్రమే పెంచిన ధరలు వర్తిస్తాయని ఏపీ సర్కార్ వెల్లడించింది.

## టికెట్ల పెంపుపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబోలో వస్తున్న మూవీ పుష్ప-2. ఈ నెల 5న విడుదల కానున్నది. ఈ క్రమంలో సినిమా టికెట్ల ధరలను నిర్మాతలు భారీగా పెంచారు. పుష్ప-2 మూవీ సినిమా టికెట్ల ధరల పెంపును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలవగా.. న్యాయస్థానం విచారణ జరిపింది. బెనిఫిట్ షో పేరుతో ఒక్కో టికెట్‌కు రూ.800 వసూలు చేస్తున్నారన్న పిటిషనర్ కోర్టుకు తెలిపారు. మొదటి 15 రోజులు సైతం అధికంగా ధరలు వసూలు చేస్తున్నారన్నారు. అయితే, భారీ బడ్జెట్ వల్ల టికెట్ ధరలు పెంచాల్సి వచ్చిందన్న నిర్మాత తరఫు లాయ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వమే ధరల పెంపునకు అనుమతించింది కదా? అని పిటిషనర్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. టికెట్ల రేట్ల పెంపుతో అభిమానులపై భారం పడుతుందన్న పిటిషనర్ తరఫు న్యాయవాది.. పెంచిన రేట్లను ఛారిటీలకు, సీఎం, పీఎం సహాయ నిధికి వెళ్లట్లేదన్నారు. పెంచిన రేట్లతో నిర్మాత లబ్ధి పొందుతున్నాడని పిటిషనర్ పేర్కొన్నారు. థియేటర్లలో టికెట్ ధరల కంటే తినుబండారాలు అధికంగా విక్రయిస్తున్నారనరి న్యాయమూర్తి పేర్కొన్నారు. పాప్‌కార్న్, నీళ్లు బాటిళ్లనే అధిక ధరలకు విక్రయిస్తున్నారని న్యాయమూర్తి గుర్తు చేశారు. బెనిఫిట్ షో, అభిమాన సంఘాలకేనన్న నిర్మాతల తరఫు న్యాయవాది.. అభిమాన సంఘాలకు రేట్లు పెంచినట్లుగా వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కోరిన నిర్మాత తరఫు న్యాయవాది కోరారు. బెనిఫిట్ షోకు పది మంది కుటుంబ సభ్యులతో వెళ్తే రూ.8వేలు అవుతుందన్న న్యాయమూర్తి అనగా.. అభిమాన సంఘాల కోసమే బెనిఫిట్ షో అన్న నిర్మాత తరఫు న్యాయవాది పేర్కొన్నారు. అర్ధరాత్రి, తెల్లవారుజామున షోలతో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న పిటిషనర్ తెలుపగా.. ఈ నెల 17కు తుదిపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.



## శివాజీగా కాంతార హీరో రిషబ్‌శెట్టి

కాంతార సినిమాతో కన్నడ, తెలుగుతోపాటు పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచాడు హీరో రిషబ్ శెట్టి . ఈ స్టార్ యాక్టర్ ఇప్పటికే ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో జై హనుమాన్ చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా మరో క్రేజీ బయోపిక్‌తో అందరినీ సర్‌ప్రైజ్ చేస్తున్నాడు. రిషబ్ శెట్టి నటిస్తోన్న బయోపిక్ శివాజీ మహారాజ్. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఖడ్గం చేత బట్టిన శివాజీ మహారాజ్‌గా వీరత్వం ఉట్టిపడే లుక్‌లో క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు రిషబ్ శెట్టి. లెజెండరీ మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత కథ నేపథ్యంలో హిస్టారికల్ డ్రామాగా రాబోతున్న ఈ మూవీని సందీప్ సింగ్ డైరెక్ట్ చేస్తున్నాడు. అంతేకాదు ఈ చిత్రాన్ని 2027 జనవరి 1న విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఇది సినిమా కంటే ఎక్కువగా ఉండబోతుంది. అపారమైన అసమానతలను అధిగమించి.. మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదురించి శాశ్వతమైన వారసత్వాన్ని సృష్టించిన యోధుడికి నివాళిగా వస్తోందని మేకర్స్ తెలియజేశారు. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలపై రాబోయే రోజుల్లో క్లారిటీ రానుంది.

**Owner, Editor, Printed & Published:** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District - 500098. Telangana. Printed at S.A Printers, D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District, Telangana, -500098. **RNI NO TELTEL/2023/86487**, Cell: 8125972476. website: quicktodaynews.com, e-mail: quicktodaynews@gmail.com